మంచిరేవుల మచిలేశ్వరాలయానికి భారీగా తరలివచ్చిన భక్తజనం

విజయగణపతి ఆలయంలో శివుడి అభిషేకంలో భక్తులు

శంషాబాద్ శ్రీవెండికొండ సిద్ధేశ్వరస్వామి ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

- భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి వేడుకలు
- శ్రీవెండికొండ సిద్ధేశ్వరస్వామి ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు

బంజారాహిల్స్, మార్చి 8: మహా శివరాత్రి పర్వదినాన్ని శుక్రవారం ఖైరతాబాద్ నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ల పరిధిలోని శివాలయాలన్నీ శివ నామస్మరణతో మార్మోగాయి. శ్రీనగర్ కాలనీలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఉదయం నుంచి విశేష అభిషేకాలు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్ నం.1లోని శివాలయం, ఫిలింనగర్ దైవ సన్నిధానం, బంజారాహిల్స్ రోడ్ నం.14లోని విజయ గణపతి ఆలయంలో పెద్దసంఖ్యలో భక్తులు పోటెత్తారు. రాత్రి ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.

శ్రీవెండికొండ సిద్ధేశ్వరస్వామి ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు

శంషాబాద్ రూరల్, మార్చి 8 : శ్రీవెండికొండ సిద్ధేశ్వరస్వామి ఆలయానికి భక్తుల భారీగా తరలివచ్చారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీవెండికొండ సిద్ధేశ్వరస్వామి ఆలయానికి దాదాపు 400 ఏండ్ల చరిత్ర ఉన్నది. శివుడికి ఇష్టమైన ఉపవాస్యం చేసి ఏ కోరిక కోరిన వెంటనే ఇచ్చే శివాలయం(వెండికొండ సిద్ధేశ్వరస్వామి) ఆలయానికి ఉపవాసం ఉన్న భక్తులతోపాటు సాధారణ భక్తులు వేలాదిగా తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చిన ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 8: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీలోని శ్రీవెంకన్నగుట్టపై వెలిసిన భూనీలా సహిత సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో తిరునక్షత్రం శ్రావణ నక్షత్రం పురస్కరించుకొని శుక్రవారం స్వామి వారికి పంచామృతాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. దేవాలయంలో పూజలు నిర్వహించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. అనంతరం పల్లకి సేవ, భజన, తీర్థప్రసాదాల వితరణ కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. టీఎన్‌జీవోస్ కాలనీతోపాటు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు వేల సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

హిమాయత్‌నగర్‌లో...

హిమాయత్‌నగర్, మార్చి 8: హిమాయత్‌నగర్‌లోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం శివుని దర్శనం కోసం పెద్దఎత్తున భక్తులు బారులుతీరారు. ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు శివాలయాలకు తరలివచ్చి పూజలు చేశారు.

మణికొండలో...

మణికొండ, ఫిబ్రవరి 8 :రాజేంద్రనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాలు భక్తుల శివనామస్మరణలతో మార్మోగాయి. బిల్వార్చనలు, క్షీరాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గండిపేట మండలం పుప్పాలగూడలోని కాశీవిశ్వేశ్వరాలయంలో, మణికొండలోని శ్రీపార్వతీ రామలింగేశ్వరాలయంలో, మంచిరేవుల గ్రామంలోని వీరభద్ర స్వామి(మచిలేశ్వర్) ఆలయాలల్లో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున ఉపవాస దీక్షలతో పూజా కార్యక్రమాలల్లో పాల్గొని స్వామివారిని దర్శనం చేసుకున్నారు. అదేవిధంగా ఖానాపూర్‌లోని శ్రీరాజన్నగుట్ట శివాలయం, గండిపేట సాయిదేవాలయంలోని శివాలయం, వట్టినాగులపల్లిలోని శివాలయాలల్లో ఆయా గ్రామాల ప్రజలు ఉపవాస దీక్షలను చేపట్టి రాత్రివేళ జాగరణ దీక్షలను చేపట్టారు.

మచిలేశ్వరాలయంలో పోటెత్తిన భక్తజనం

మంచిరేవుల గ్రామంలోని వీరభద్రస్వామి(మచిలేశ్వర్) ఆలయానికి భక్తులు పోటెత్తారు. గత కొన్నేళ్లుగా నగరం నుంచే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తుంటారు. లక్షలాదిగా భక్తులు మచిలేశ్వర్ ఆలయానికి వచ్చి దర్శించుకున్నారు. గత వారం రోజుల ముందు నుంచే పాలకవర్గం శివరాత్రి ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేయడంతో పాటుగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేపట్టారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో...

పుప్పాలగూడలోని చారిత్రాత్మక కాశీ విశ్వేశ్వరాలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ఉపవాసదీక్షలను విరమించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపకాంతులతో అలంకరించారు. అదేవిధంగా ఖానాపూర్‌లోని రాజన్నగుట్ట లోనూ భారీగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక సౌకర్యాలను కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

కల్యాణోత్సవంలో కొలువుదీరిన స్వామి వారు

మంచిరేవుల ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ రమణగౌడ్, ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ప్రజాప్రతినిధులు

బంజారాహిల్స్ రోడ్ నం.1లోని శివాలయంలో అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

శ్రీనగర్‌కాలనీలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

అత్తాపూర్ శివాలయంలో మంత్రి, ఎమ్మెల్యే పూజలు

అత్తాపూర్ శివాలయంలో శివలింగానికి పూజలు చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

అత్తాపూర్, మార్చి 8: రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్‌లోని శివాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. శుక్రవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పరమశివుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ పూజల్లో ఆలయ కమిటీ పెద్దలు కొండకళ్ల మోహన్‌రెడ్డి, బి.శ్రీనివాస్‌రెడ్డి, జయరాంరెడ్డి, నాయకులు మిద్దెల సురేందర్‌రెడ్డి, సురేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా శ్రీవారి కల్యాణం

శ్రీనగర్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి శ్రవణ నక్షత్రం సందర్భంగా కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారికి 108 స్వర్ణ పుష్పాలతో విశేష పుష్పార్చన చేశారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆలయ ఈవో లావణ్య, పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్.రామయ్య తదితరులు పాల్గొన్నారు. – బంజారాహిల్స్, మార్చి 8

జూబ్లీహిల్స్‌లోని టీటీడీ వేంకటేశ్వరస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ధ్వజారోహణం అనంతరం స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పెద్ద శేషవాహన సేవ నిర్వహించారు.

– బంజారాహిల్స్, మార్చి 8

షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆదేశాలతో షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకం చెక్కులు పంపిణీ చేశారు. ఆయా పథకాల్లో లబ్ధిదారులకు కార్పొరేటర్లు రాజ్‌కుమార్ పటేల్, దేదీప్య విజయ్, తహసీల్దార్ నయూముద్దీన్‌తో కలిసి చెక్కులు అందజేశారు. – జూబ్లీహిల్స్, మార్చి 8

జీహెచ్‌ఎంసీ మహిళా పారిశుధ్య కార్మికులకు సత్కారం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీహెచ్‌ఎంసీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జీహెచ్‌ఎంసీ మహిళా పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, సీనియర్ నాయకుడు చిన్న శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ. సూర్యోదయానికి ముందే మహానగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. కోటి మందికి పైగా నివాసం ఉండే మహానగరాన్ని మహిళా కార్మికులు అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు. – ఖైరతాబాద్, మార్చి 8

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూబ్లీహిల్స్‌లోని పీఎమ్‌జే జువెల్స్ ఆధ్వర్యంలో 'హీరోయిన్స్ ఆఫ్ రియల్ లైఫ్' పేరుతో సరికొత్త ఆభరణాల కలెక్షన్స్‌ను శుక్రవారం ఆవిష్కరించడంతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న మహిళలను ఘనంగా సత్కరించారు. యాంకర్ స్వప్న, సేల్స్ ఫోర్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ శ్రీలక్ష్మి, ఫైనాన్సియల్ కన్సల్టెంట్ స్వాతి, లూసిడ్ డయాగ్నస్టిక్స్ సంస్థ నిర్వాహకురాలు డా.సునీత తదితరులు సత్కారం అందుకున్నారు. పీఎమ్‌జే డైరెక్టర్ సీమా తదితరులు పాల్గొన్నారు. –బంజారాహిల్స్, మార్చి 8

10 నుంచి వేగాశ్రీ డైమండ్స్‌లో ఆభరణాల ప్రదర్శన

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూబ్లీహిల్స్ రోడ్ నం. 36లోని వేగాశ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థలో ఈ నెల 10 నుంచి 18వ తేదీ వరకు 'ప్యూర్ గోల్డ్-ప్యూర్ వ్యాల్యూ' పేరుతో ప్రత్యేక ఆభరణాల ప్రదర్శన నిర్వహించనున్నారు. శుక్రవారం వేగాశ్రీలో ఏర్పాటు చేసిన కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ప్రముఖ వైద్యురాలు, పద్మశ్రీ మంజుల అనగాని చేతులమీదుగా ప్రదర్శనకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళ్లు చెదిరే వజ్రాభరణాలను ధరించిన మోడల్స్ చూపరులను ఆకట్టుకున్నారు. – బంజారాహిల్స్, మార్చి 8

మహిళలు సమాజానికి మార్గదర్శకులు

మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్ దేదీప్యరావు

మహిళా దినోత్సవం వేడుకల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

కేక్‌కట్ చేస్తున్న కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, వనం సంగీతాయాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి

- ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, దానం నాగేందర్
- ఘనంగా మహిళా దినోత్సవం

జూబ్లీహిల్స్,మార్చి 8:మహిళలు కుటుంబానికే కాకుండా సమాజానికి మార్గదర్శకులని, వారి అసమాన ప్రతిభా పాటవాలతో అన్ని రంగాల్లో రాణిస్తున్నారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొని కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్‌కుమార్‌పటేల్, మహిళా నాయకులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లో...

బంజారాహిల్స్, మార్చి 8: బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో పాటు కార్పొరేటర్లు దేదీప్యరావు, సంగీతాయాదవ్ తదితరులు కేక్‌కట్ చేసి మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డితో పాటు కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, మహిళా విభాగం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా జీవించాలి..

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి8: మహిళలు పౌష్టికాహారాన్ని తీసుకుంటేనే ఆరోగ్యవంతమైన జీవితం లభిస్తుందని డాక్టర్ రేఖ, సీహెచ్‌వో మహ్మద్ సిరాజుద్దీన్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లిలోని ప్రాథమి ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంతో పాటు ఆరోగ్య మహిళా కార్యక్రమాలను నిర్వహించారు. గత సంవత్సరం మహిళలకు అన్ని రకాల ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు ఆరోగ్య మహిళా కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈకార్యక్రమం ప్రారంభించి సంవత్సరం పూర్తైన సందర్భంగా మహిళలకు మరింత మెరుగైన సదుపాయాలు, సేవలందించేందుకు ఈ ఆరోగ్య మహిళా కార్యక్రమాలను ప్రతి మంగళ, ప్రతి గురువారం నిర్వహించనున్నామన్నారు. ఈసందర్భంగా ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలను ఘనంగా సన్మానించారు. డాక్టర్ బలరామ్, డాక్టర్ హీనా, కేశవ్, శివకుమార్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

- శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు రాజకీయ రంగంలో సైతం మహిళలే అగ్రభాగాన ఉన్నారని నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేశ్ రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నవయువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో బాబుల్‌రెడ్డినగర్‌లో మహిళలను ఘనంగా శాలువాలతో సత్కరించారు. క్లబ్ సంస్కృతిక కార్యదర్శి గొంత్యల శ్రీనివాస్, ప్రవీణ్ సన్నీ పాల్గొన్నారు.

నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో..

మణికొండ, మార్చి 8 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నార్సింగి పురపాలక పారిశుధ్య, రెవెన్యూ సిబ్బంది, మహిళా పోలీస్ కానిస్టేబుళ్లను నార్సింగి మున్సిపాలిటీ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కె.పవన్‌కుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం, వార్డు జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

- వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మణికొండలోని ఫ్లోటిల్ల క్లబ్ హౌస్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శంషాబాద్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కొలన్ సుష్మామహేందర్‌రెడ్డి ఘనంగా నిర్వహించారు. అనంతరం మణికొండ వాసవి క్లబ్ సభ్యులను ఆమె అభినందించారు. సేవా కార్యక్రమంలో భాగంగా కాచం నాగరాజునవ్య కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు వంగవీటి వంశీకృష్ణ, కార్యదర్శి తల్లాడ యశ్వంత్, కోశాధికారి శిరీషా, జోన్ చైర్మన్ కలగార్ల నిరిష, రీజియన్ చైర్మన్ గంగిశెట్టి నవీన్‌కుమార్, రీజియన్ సెక్రటరీ రామ్‌నరేశ్, జిల్లా ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

బాబుల్‌రెడ్డినగర్‌లో మహిళలను సన్మానిస్తున్న నవయువ యూత్‌క్లబ్ అధ్యక్షుడు కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి

యూసుఫ్‌గూడలో కిట్టి గ్రూప్ ఫౌండర్ కైసర్ జహాన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న మహిళలు..

మణికొండలో వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శంషాబాద్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కొలన్ సుష్మామహేందర్‌రెడ్డి, క్లబ్ సభ్యులు

షీరో హోమ్‌ఫుడ్‌కు ఉత్తమ హోమ్ ఫుడ్, మహిళా ఉపాధి సంస్థగా గుర్తింపు

అవార్డు అందుకున్న సంస్థ తెలుగు రాష్ట్రాల కోఆర్డినేటర్ విజయ్‌వర్మ పాకలపాటి

జూబ్లీహిల్స్, మార్చి 8: రుచికరమైన, శుచికరమైన, ఆరోగ్యకరమైన ఇంటి భోజనాన్ని అందిస్తూ ప్రజా శ్రేయస్సుకు కృషి చేస్తున్న షీరో హోమ్ ఫుడ్‌ను ఉత్తమ హోమ్ ఫుడ్, మహిళా ఉపాధి సంస్థగా గుర్తిస్తూ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎలివేట్స్ ఎలైట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కారాన్ని అందజేశారు. హిమాయత్‌నగర్‌లోని ఎలివేట్స్ ఎలైట్ కల్చరల్ అసోసియేషన్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు రవి కిశోర్, జాతీయ ఫిలిం సెన్సార్ బోర్డ్ మెంబర్ సిద్ధవతం ప్రసన్న లక్ష్మి, మిసెస్ ఇండియా-2022 షెర్రీ చేతుల మీదుగా షీరో హోమ్ ఫుడ్ మహిళా సాధికారత సంస్థ తెలుగు రాష్ట్రాల కోఆర్డినేటర్ విజయ్‌వర్మ పాకలపాటి ఈ అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా విజయ్‌వర్మ మాట్లాడుతూ..సంస్థ వ్యవస్థాపకులు తిలగరసు, జయశ్రీ మూడేం డ్ల కిందట ప్రారంభించిన షీరో ఉచిత శిక్షణ, సాంకేతిక మద్దతు, ప్రచార తోడ్పాటుతో ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ద్వారా ఇప్పటివరకు 2వేల మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించామని, ఈ స్టార్ట అప్ ద్వారా ఒక మిలియన్ మహిళలకు ఉపాధి ఇవ్వడమే సంస్థ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల మాస్టర్ ఫ్రాంచైజ్ నిర్వాహకురాలు సువర్ణా దేవి ఈ అవార్డు దక్కడం తమ మీద మరింత బాధ్యతను పెంచిందన్నారు.

అవార్డు అందుకుంటున్న సంస్థ తెలుగు రాష్ట్రాల కోఆర్డినేటర్ విజయ్ వర్మ పాకలపాటి

ఆకట్టుకున్న అనన్య నృత్య ప్రదర్శన

జూబ్లీహిల్స్‌లోని టీటీడీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్‌లో 11వ తరగతి విద్యార్థిని ప్రదర్శించిన అనన్య సూరపనేని కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకున్నది. ముద్దుగారే యశోద, నారాయణీయం, జేం జేం తననా.. శివాష్టకం తదితర గీతాలకు అద్భుతమైన అభినయంతో అందరినీ అలరించింది.

– బంజారాహిల్స్ , మార్చి 8

తాళం వేసిన ఇంట్లో చోరీ

బంజారాహిల్స్, మార్చి 8 : తల్లి చనిపోవడంతో ఇంటికి తాళం వేసి బేగంపేటకు వెళ్లిన వ్యక్తి ఇంట్లో చోరీ జరిగిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఎన్‌బీటీనగర్‌లో నివాసం ఉంటున్న అవినాష్ అనే వ్యక్తి ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటారు. ఈనెల 4న తన తల్లి మృతి చెందడంతో ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి బేగంపేటకు వెళ్లారు. ఈనెల 5న అర్ధరాత్రి అవినాష్ ఇంట్లోకి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు అల్మారాలోని బంగారు ఆభరణాలు తస్కరించారు. మరుసటిరోజు ఉదయం స్థానికులు అవినాష్‌కు సమాచారం ఇవ్వగా.. అతడు శుక్రవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏప్రిల్ 12, 13 తేదీల్లో జానపదమే జ్ఞానపదం

నగరంలో భారీ ఎత్తున జానపదోత్సవం

ఖైరతాబాద్, మార్చి 8: మరుగున పడిపోతున్న జానపద కళలను కాపాడేందుకు ఏప్రిల్ 12, 13 తేదీల్లో రెండురోజులపాటు 'జానపదమే జ్ఞానపదం' పేరుతో జానపదోత్సవాన్ని హైదరాబాద్‌లో నిర్వహించనున్నామని నటరాజ్ అకాడమీ డైరెక్టర్ గిరి తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గిరి మాట్లాడుతూ.. అంతరించిపోతున్న జానపద కళలను కాపాడేందుకు తమ సంస్థ కృషి చేస్తోందని, తమ సంస్థ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 12, 13తేదీల్లో నిర్వహించనున్న జానపదోత్సవంలో భాగంగా 3500 మంది జానపద కళాకారులతో ఎల్‌బీ స్టేడియం నుంచి తెలుగు లలిత కళాతోరణం దాకా భారీ ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. 45 రకాలైన జానపద కళారూపాలను ఈ ర్యాలీలో ప్రదర్శించనున్నామని, ప్రత్యేక ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. ఈ ఉత్సవాలకు అమెరికాలో నివాసం ఉంటున్న ఎన్ఆర్ఐ శరత్‌చంద్ర ఆర్థిక సహకారం అందిస్తుండగా.. సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, మనం ఫౌండేషన్ తదితర సంస్థలు ఇతర సహకారం అందిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులను ఆహ్వానించామని తెలిపారు. కార్యక్రమంలో పాశం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నటరాజ్ అకాడమీ డైరెక్టర్ గిరి